ప్రజాశక్తి

శనివారం 4 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

నేడే నేవీ పండగ

◆ సాగర తీరంలో నావికాదళ విన్యాసాలకు సర్వం సిద్ధం

◆ ముఖ్య అతిథిగా హాజరుకానున్న సిఎం చంద్రబాబు

విశాఖ తీరంలో సిద్ధమైన వేదిక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

నేవీ పండగకు విశాఖ సిద్ధమైంది. రాష్ట్రంలో నౌకాదళ దినోత్సవం-2024కు కొనసాగింపుగా శనివారం విశాఖ సాగర తీరంలో నేవీ విన్యాసాలు జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు. తూర్పు నౌకాదళం ఏటా మెరైన్ కమోండోల విన్యాసాలతో కనుల పండగకు విశాఖ తీరం వేదిక కానుంది. విన్యాసాలను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ తిలకించేలా నావికాదళం ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది ఒడిశాలోని పూరీలో నేవీ వేడుకలు జరగ్గా వాటి కొనసాగింపు వేడుకలు డిసెంబరు 4న నిర్వహించే నావికాదళ విన్యాసాలు 2024 డిసెంబర్ 4న ఒడిశాలో జరగ్గా దేశం యావత్తూ తిలకించింది. అయితే విశాఖలోనూ నెల రోజుల వ్యవధిలో వీటిని నిర్వహించాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే ఈ నేవీ పండగకు అత్యాధునిక విమానాలు, యుద్ధనౌకలు, షై పాక్‌లు సిద్ధమయ్యాయి. విశాఖలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతాయని నేవీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల జాతికి అంకితం చేయబడిన ఐఎన్ఎస్ నిర్దేశక్ మొదలైనవి పర్యాటకులు, సందర్శకులను అలరించనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా నావికాదళ అధికారులు జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో నేవీ డే విన్యాసాల కోసం నిరంతర సమావేశాలు, సమీక్షలు జరుపుతూ పోలీస్, మిగతా 2లో..

ఆర్‌కె బీచ్‌లో ఏర్పాట్లును పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

కన్వేయర్ స్ట్రక్చర్ కూలిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడుతున్న ఉక్కు కార్మిక సంఘ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌లో కుప్పకూలిన కన్వేయర్ స్ట్రక్చర్

బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో ఉత్పత్తిపై ప్రభావం

వార్త మెయిన్‌లో..

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 42 అంశాలను పొందుపరచగా అన్నింటిపైనా చర్చించినట్టు తెలిపారు. ఒక అంశాన్ని వాయిదా వేశామన్నారు. మిగిలిన 41 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి చర్చ జరిపి ఆమోద ముద్ర వేశామన్నారు. సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

విధుల్లో కొనసాగించాలని వాలంటీర్ల దీక్ష

▶ వార్త 2లో..

ఆలోచింపజేసిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

▶ వార్త 4లో..

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

▶ వార్త 7లో..

సమీక్ష జరుపుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8న జరిగే భారత ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసే నిమిత్తం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులు, మిగతా 2లో..

కార్మికుల నిలుపుదల చట్ట విరుద్ధం

జివిఎంసి వద్ద మున్సిపల్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముందస్తు నోటీసు ఇవ్వకుండా నోటి మాటతో అర్ధాంతరంగా జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం చట్ట విరుద్ధమని పేర్కొంటూ జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ డెత్, రిటైర్మెంట్ అయిన కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయస్సును కొనసాగించాలన్నారు. అలా కాకుండా అర్ధాంతరంగా ఎటువంటి ముందస్తు నోటీసూ ఇవ్వకుండా పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర విభాగాల్లో కార్మికులను నిలిపివేయడం దారుణమన్నారు. వెంటనే వారిని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఇతర సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉన్న కార్మికులను తగ్గించరాదన్నారు. అనంతరం ర్యాలీగా జివిఎంసి ప్రధాన కార్యాలయానికి వెళ్లి కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మిగతా 2లో..

విశాఖలో ధర్నా నిర్వహిస్తున్న జివిఎంసి కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

నేడే నేవీ పండగ

రెవెన్యూ జివిఎంసి, విశాఖ పోర్టు అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

నేవీ విన్యాసాల నేపథ్యంలో శనివారం నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు నౌకాదళ యుద్ధ విన్యాసాలు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనదారులు తగు సూచనలు పాటించాలని నగర పోలీసులు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, పంది మెట్ట జంక్షన్ నుంచి నోవోటల్ హోటల్ వరకు, సెంచరీ క్లబ్ నుంచి నోవోటల్ హోటల్ వరకు, సిరిపురం జంక్షన్ నుంచి బీచ్ రోడ్ ఎన్‌టిఆర్ విగ్రహం వరకు, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ నుంచి పాండు రంగాపురం జంక్షన్ వరకు పాసెస్ లేని వాహనాలను అనుమతించరు. అలాగే సిరిపురం నుంచి బీచ్ వైపు వచ్చే సాధారణ వాహనదారులు ఆంధ్ర యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లేదా ఆంధ్ర యూనివర్సిటీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో వాహనాలను పార్కు చేసుకోవాలి. పార్క్ హోటల్ నుండి ఎటువంటి వాహనాలనూ బీచ్ రోడ్డులోకి అనుమతించరు. జోడిగుళ్లపాలెం, ఎంవిపి.కాలనీ, కురుపాం టవర్స్ మీదుగా వచ్చే సాధారణ వాహనదారులు వారి వాహనాలను ఎంజిఎం గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. జగదాంబ జంక్షన్ నుండి వచ్చే వాహనదారులు, సెవెన్ హిల్స్ హాస్పిటల్ నుండి వచ్చే వాహనదారులు, కెజిహెచ్ వైపు నుండి వచ్చే వాహనదారులు విధిగా సూచనలు పాటించాలి.

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

నేవీ విన్యాసాల వీక్షణకు సిఎం రాక నేపథ్యంలో ఏర్పాట్లను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆర్‌కె బీచ్‌లో ఆయన పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. ఎటువంటి లోపాలకూ తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, డివి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు. చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్ రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పిఎం.సత్యవేణి ఉన్నారు.

కార్మికుల నిలుపుదల చట్ట విరుద్ధం

యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఆర్.నాయుడు, ఒమ్మి అప్పారావు, గణేష్, ఎం.ఈశ్వరరావు, సీర రమణ, వెంకటరావు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, మున్సిపల్ వర్కర్లగా అదనంగా నియమించిన 15 మంది కార్మికులకు 8 నెలల నుంచి బకాయిపడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని, నెల నెలా జీతాలు వచ్చే విధంగా చూడాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులలో వీరిని కలపాలని కోరారు. క్లాబ్ వెహికల్స్‌లో పనిచేస్తున్న లోడర్స్ 28 మందికి బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని, కాంట్రాక్టర్ వాటా పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. మలేరియా డిపార్ట్మెంట్‌లో తొలగించిన నలుగురు కార్మికులను విధుల్లో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి శివకుమార్, నిమ్మకాయల అజయ్, సంతోష్, ఎర్రంశెట్టి ఓం శివ, నూకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక దేశ ప్రధాని మొట్టమొదటి సారిగా రాష్ట్రానికి విచ్చేస్తున్నారని, ఈ నేపథ్యంలో అందరూ బాధ్యతతో మెలగాలని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు రెండు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఆ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రియల్ టైం లొకేషన్ సమాచారం ఉండేలా సిసి టీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రధాన వేదిక వద్ద, రోడ్ షో జరిగే ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో భాగంగా ప్రధాని కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి, ప్రధాని పర్యటన షెడ్యూల్ గురించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో సిపి శంఖబ్రత బాగ్చీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో కొనసాగించాలని వాలంటీర్ల దీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న వాలంటీర్లను యధావిధిగా విధుల్లో కొనసాగించాలని కోరుతూ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. వారినుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు వాలంటీర్లను కొనసాగించి, వారికి వేతనం రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఎన్నికలకు ముందు వాలంటీర్ల చేత జగన్మోహన్ రెడ్డి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి జీవితాలు మెరుగుపడే విధంగా గౌరవప్రదంగా బతికేటట్లు చూస్తామని చంద్రబాబు చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ మాటను విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వాలంటీర్లకు సచివాలయాల నుంచి పనులు చెప్పకపోవడం, జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. వీరంతా ప్రభుత్వం నియమించిన వారని, రాజకీయ కార్యకర్తలు కాదని అన్నారు. వారికి బకాయి ఉన్న ఏడు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షలు ప్రారంభం సందర్భంగా శిబిరం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.దీప్తి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడతామని, మహిళల మీద ఏమాత్రం గౌరవం ఉన్నా వాలంటీర్లు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోడూరు రాము, అజార్, ఆంజనేయులు పార్వతి, కె.లక్ష్మణ్, ఆదిలక్ష్మి, శ్యామ్, వాసు, రాజు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన వాలంటీర్లు

ఉక్కుపై చంద్రబాబు ఆలోచించాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నానికి మోడీ వస్తున్నారని, ఆయనతో మాట్లాడి ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా ఎపి ప్రభుత్వం తొందరపాటు చర్యలు తీసుకుందని అన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అమిత్ షా అవహేళన చేశారన్నారు. అంబేద్కర్‌ను తిట్టేందుకే బిజెపి పుట్టిందా ? అని ప్రశ్నించారు. ఇవిఎంల ట్యాంపరింగ్ వల్లే ఎపిలో, కేంద్రంలో, హర్యానాలో, మహారాష్ట్రలో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే ఏమి? రాకుంటే ఏమి?, అది ఆ పార్టీ సొంత నిర్ణయమని అన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో ఆదరణ ఉన్నా సరైన నాయకత్వం లేదని తెలిపారు. నాయకులు సూర్యారావు, అభిదా బేగం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 28వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రామనగర్ బజార్ డౌన్‌లో బ్రిడ్జి సమీపంలో సుమారు రూ.27 లక్షల వ్యయంతో రజకుల కోసం ధోబీ ఘాట్ పునర్నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సామాజిక భవనం తదితర పనులకు ఆయన పునాదిరాయి వేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్ల అప్పలకొండ, ఆ వార్డు ఇన్‌ఛార్జి నక్క కనకరాజు, నక్క అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్ ఆళ్ల శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమాలు, త్యాగాలే..

ఉక్కు సత్యాగ్రహం చిత్రానికి ప్రేరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు చేసిన ప్రజా ఉద్యమాలు, నాయకుల త్యాగాలే ఉక్కు సత్యాగ్రహం చిత్రానికి ప్రేరణ అని ఆ చిత్ర నిర్మాత, దర్శకుడు, హీరో సత్యారెడ్డి అన్నారు. నగరంలోని చిత్రాలయ ఐనాక్స్‌లో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని శుక్రవారం మధ్యాహ్నం సిపిఎం నాయకులు, ఉద్యమ నాయకులు, స్టీల్ ప్లాంట్ నాయకులు, చిత్రంలో నటించిన నటీనటులతో కలిసి వీక్షించారు. అనంతరం సత్యారెడ్డి మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఉద్యమకారుల త్యాగాలను ప్రజలకు తెలియజేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. సీనియర్ నటుడు, జివిఎంసి బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్నకుమార్, నంది అవార్డు గ్రహీత వినయ ప్రకాష్, ధనుశ్రీ తదితరులు ఇందులో నటించారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కానివ్వబోమన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం నాయుకులు బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉక్కు భూ నిర్వాసితుల సంఘం ప్రతినిధి నర్సింగరావు, ఉమ్మడి అప్పారావు, కాంగ్రెస్ నాయుకులు వజ్జిపర్తి శ్రీనివాస్, మజ్జి దేవిశ్రీ పాల్గొన్నారు.

SOUTH INDIAN Bank

The South Indian Bank Ltd.
Narsipatnam Branch.
Back side Sub collector Office, RamaRao peta,
Narsipatnam,531116

GOLD AUCTION FOR PLEDGED ORNAMENTS AT BANK

Whereа's, the Branch head of the south Indian bank ltd issued overdue notice calling upon the borrower to clear the dues in gold loan availed by him/her. The borrower had failed to repay the amount, notice is hereby given to the borrower and the public in general that the undersigned will conduct auction of the gold ornaments strictly "As is what is Basis & Whatever there is Basis & Without recourse Basis". The auction will be conducted at The south Indian bank ltd, Narsipatnam Branch on 10-01-2025 at 4 PM for the below mentioned Gold Loans.
GST is applicable.

Sl.No	Name	Gold Loan Number	Gross weight(in Gram)
1.	A.Siva Ramesh	0978653000007175	103.90
2.	SettiN.S.SambaMurthy	0978653000005076	60.30

Please contact +919000256133 for more clarification
Sd/- Branch Manager
The south Indian bank ltd

IN THE HONOURABLE COURT OF THE VII ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.A.811/2015 IN O.S.1781/2014
Between:
Smt P. Jyothamma
Petitioner/DHR/Plaintiff
And:
1. CH Bangaramma (Died)
2. Sri CH Prasad
Respondent/JDR
(The 2nd respondent/defendant have been impleaded as per the orders of this Hon'ble court in I.A.250/2020 dt:17-10-2022)
NOTICE
To,
JDR No.2 Sri Chakka Prasad,
Adopted son of Late Ch. Bangaramma, Hindu, aged 39 years, Rio D. No. 34-4-24, Vadicherla Veedhi, Gnanapuram, Visakhapatnam.
Please take notice and appear either in person or through an Advocate before Honourable Court of the VII ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM in I.A.811/2015 IN O.S.1781/2014 on 22-01-2025 at 10:30 A.M and file your objections if any failing which the Hon'ble Court will pass an ex-pate orders against both of you.
This is the order of Honourable Court of the VII ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.
D.V.V.R.PRATAP
R.SARADA NAGARJUN
ADVOCATES
VISAKHAPATNAM

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
O.S. 92/2023
Between:
1) Chowdari Rajesh and another.
.....Plaintiffs.
And:
1) Chowdari Adinarayana and 5 others.
...Defendants.
To,
D4) Chowdari Syamalarao, S/o late Narasimhappadu, Flat No: 303, Madhuravanam Apartments, Near Car Shed, Madhurawada, Visakhapatnam Town and District.
D5) Chowdari Venkata Satyanarayana, S/o late Narasimhappadu, C/o Door No: 3-20-4, Ramamohanraja Nagar, NR Kota, Kakinada, East Godavari District.
NOTICE
Please take notice that the above suit filed by the plaintiff against you for specific performance of agreement of sale, which stands posted to **27-01-2025** for your appearance and notice to you. So you pleased attend on the said date at about **10-30 A.M.**, before the above court by personally or through your agent, otherwise the matter will be decided in your absence.
CHIGURUPALLI RAMA MOHAN
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9440116221.

ఉక్కు నిర్వాసితులకు అందని నివాస స్థలాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి విలువైన భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇచ్చినా, వారిలో చాలామందికి నేటివరకు నివాస స్థలాలు ఇవ్వకపోవడం దారుణమని ఇండియన్ మహిళా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు జివిఎల్ పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఆర్.కార్డున్న సాసర్ల సన్యాసమ్మ అనే నిర్వాసితురాలు నలభైఏళ్లుగా అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసిన తనకు న్యాయం జరగకపోవడంతో తమ సంస్థను ఆశ్రయించిందన్నారు. దీనిపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి బాధితురాలు సన్యాసమ్మకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలపై సానుకూల స్పందన కనిపిస్తోందని, ఈ నేపథ్యంలో ఉక్కు నిర్వాసితుల సమస్యలకు మోక్షం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సాసర్ల గౌరి, భవాని, సీత, బలివాడ కన్నబాబు, నాగాల రాజేష్ పాల్గొన్నారు

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం 2025 కేలండర్‌ను శుక్రవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం వైద్య ఆరోగ్య విభాగం రీజనల్ డైరెక్టర్ రాధారాణి డిఎంహెచ్ఓ డాక్టర్ పి జగదీశ్వరరావు ఆవిష్కరించారు. తెలుగు నాడు వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం వెంకటలక్ష్మి, విశాఖ జిల్లా అధ్యక్షుడు నగేష్ పట్నాయక్, కార్యదర్శి రత్నం, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, కార్యదర్శి రామానాయుడు, తెలుగు నాడు జోనల్ కార్యదర్శి సత్యానంద్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి నగరపాలెం పంచాయితీ పరిధిలో ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ 2.50 లక్షలతో సాగునీటి కాలువల పూడికతీత పనులను శుక్రవారం సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పల్లా నీలిమ, గ్రామ పెద్దలు చంద్రశేఖర్, సన్యాసిరావు, ఫీల్డ్ అసిస్టెంట్ మురళి, టిడిపి, జనసేన నాయకులు ఆర్ సురేష్ కుమార్, ఇ నానాజీ పాల్గొన్నారు

నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం: మండల కేంద్రం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా శుక్రవారం మారికవలసలోని నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటిని శుద్ధి చేయడం, బాట్లింగ్, ప్యాకింగ్ తదితర ప్రక్రియలు జరుగుతున్న తీరుపై కేంద్రం నిర్వాహకులు జిఎన్.గాయత్రీ దేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కెఆర్‌కె పట్నాయక్, ఉపాధ్యాయులు భాస్కరరావు, శ్రీనివాసరావు, ఒకేషనల్ ఉపాధ్యాయులు భీష్మ నారాయణ, ధనలక్ష్మి పాల్గొన్నారు

సింగనబంద రెవెన్యూ సదస్సు బహిష్కరణ

ప్రజాశక్తి- తగరపువలస: అధికారులకు మొరపెట్టుకోవడమే తప్ప, ఏ ఒక్క సమస్య పరిష్కారం కానప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రయోజనమేంటని భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ, రైతులు గాడు తాతినాయుడు, గాడు వెంకటరావు తదితరులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశించినప్పటికీ, భీమిలి మండలంలో పలుచోట్ల అందుకు భిన్నంగాజరుగుతున్నాయన్నారు. శుక్రవారం భీమిలి మండలం సింగనబంద రెవెన్యూ సదస్సును బహిష్కరించినట్లు వెల్లడించారు.

సదస్సులో నిరసన తెలుపుతున్న జెడ్‌పిటిసి, సర్పంచ్, రైతులు

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సింగనబంద రెవెన్యూ సదస్సుకు అధికారులు. నిర్ణీత సమయానికి హాజరు కాలేదన్నారు.గతంలో జరిపిన రీ సర్వే లో పలువురు రైతులకు అన్యాయం జరిగిందని నిరసన వ్యక్తం చేశారు. ఒకరి భూమి వేరొకరి పేరు మీద చూపించడం, ఎల్‌పిఎం నంబర్‌ను ఐదుగురు, పది మంది రైతులకు జాయింట్‌గా ఇవ్వడంతో రైతులు గందరగోళంలో పడ్డారని, ఇవే కాక పలు సమస్యలను రెండు నెలల క్రితం సింగనబందలో నిర్వహించిన రీసర్వే సదస్సులో అధికారులకు విన్నవించగా, వాటిలో ఏ ఒక్కటీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇపుడు మళ్లీ అవే సమస్యలను అధికారులకు ఇస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు. మొక్కుబడి సదస్సులకు కాకుండా జవాబుదారీగా, రైతుల సమస్యలను పరిష్కరించేలా సదస్సులను నిర్వహించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలన్నారు.

పద్మనాభం. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఏడు రరఖాస్తులు వచ్చినట్లు పద్మనాభం తహశీల్దార్ కె.చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్యామల, విఆర్ఒలు, విఎలు పాల్గొన్నారు.

ఎవాంటెల్‌తో 'గీతం' ఎంఒయు

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : అంతరిక్షం, దేశ రక్షణ, కమ్యూనికేషన్ రంగాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రముఖ సంస్థ ఎవాంటెల్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎవాంటెల్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎమ్‌టెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్‌పై ప్రత్యేక కోర్సును నిర్వహించనున్నారు. ఈ కోర్సులో చేరి ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రతి నెలా రూ.25 వేల స్టైఫండ్‌తోపాటు కోర్సు పూర్తి చేసిన అనంతరం ఎవాంటెల్ సంస్థలో రూ. 9 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో యుజిసి, ఎఐసిటిఇ అనుమతులతో వివిధ ఇంజనీరింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులకు శిక్షణ ఇవ్వడానికి ఏటా సిలబస్‌లో కొత్త అంశాలను చేర్చుతున్నామని వెల్లడించారు. పరిశ్రమలు,విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. ఎవాంటెల్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ రంగంలో బోధన, పరిశోధనలకు గీతం విశ్వవిద్యాలయానికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ కామేశ్వరరావు, డాక్టర్ జివికె.శర్మ, ఇఇసిఇ విభాగం సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆందోళన

- తక్షణమే తొలగించాలి
- అధికారులకు బొడ్డపాలెం గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం జగనన్న లేఔట్ సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు సర్వే నెంబరు 292లో కొంతమంది షెడ్లు ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆక్రమితస్థలం వద్దకు పెద్దఎత్తున చేరుకున్న గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

ఆక్రమిత స్థలంలో ఆందోళన చేస్తున్న బొడ్డపాలెం గ్రామస్తులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బొడ్డపాలెం జగనన్న లేఔట్ సమీపంలో 1.17ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత స్థలంలో దివీస్ ల్యాబొరేటరీ సౌజన్యంతో పార్కు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కు సమీపంలో మిగతా స్థలంపై కొంతమంది ఆక్రమణదారుల కన్నుపడడంతో వారు రేకులషెడ్లుతో పాటు చదునుచేసే పనులు చేపట్టడాన్ని గుర్తించిన గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజోపయోగమైన కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్ తదితర నిర్మాణాలకు వీలుగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇలా



ప్రభుత్వభూమిలో ఉన్న షెడ్

కొందరు ఆక్రమణలకు పాల్పడడం సరికాదని, దీనిపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ఆక్రమణలను అడ్డుకోవడంతోపాటు ఇప్పటికే వేసిన షెడ్‌లను తొలగించాలన్నారు.

విషయం తెలుసుకున్న ఎస్ఐ గంట్యాడ సంతోష్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అక్కడున్న నిర్మాణాలు ప్రభుత్వ భూముల్లో ఉన్నాయో లేవో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. అక్రమ నిర్మాణాలైతే వేసిన షెడ్‌లను తొలగించడంతోపాటు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. వివరాలివి. చందక పంచాయితీ ఎర్ర వారి కల్లాలు చెందిన తాడి వెంకటరావు ఆర్థిక సమస్యలతో మద్యానికి బానిసై, మూడు నెలలుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలోబయటకు వెళ్ళి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన వెంకటరావు, తిరిగి రాకపోవడంతో భార్య కుమారి బంధువులకు సమాచారం అందించి, చుట్టుపక్కల వెతికినప్పటికీ ప్రయోజనం లేదు. దీంతో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. సిఐ చింత వాసునాయుడు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాడి వెంకటరావు

'అపోలో'లో అరుదైన చికిత్స

రోగితో అపోలో వైద్యులు డాక్టర్ రవిచరణ్

ప్రజాశక్తి - ఆరిలోవ : పదేళ్లుగా తరచూ దగ్గు, జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఎడమ వైపు ఛాతి నొప్పి తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 24 ఏళ్ళ యువకుడికి అపోలో వైద్యులు విజయవంతంగా చికిత్స చేశారు. ఆయా అనారోగ్య సమస్యలతో . ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయంక కాకపోవడంతో అపోలో ఆసుపత్రికి వైద్యానికి వచ్చాడు. డాక్టర్ ఆవాల రవిచరణ్ పర్యవేక్షణలో అపోలో వైద్యులు రోగికి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగి గతచరిత్రను తెలుసుకొనే సమయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక వస్తువు(పెన్, పెన్సిల్ టిప్)ను లోపలకు తీసుకున్నట్టు అనుమానంగా చెప్పాడు. దీంతో రోగికి సిటి స్కాన్ చేశారు. ఎడమ కింద లోబ్ సెగ్మెంటల్ బ్రాంకస్‌లో ఒక వైపు ఒక చిన్న వస్తువు ఉన్నట్టు గుర్తించారు. బ్రోన్కోస్కోపీ సూట్‌లో అతనికి బ్రోన్కోస్కోపీ టిష్యూ తొలగించారు. దీంతో రోగి ఆరోగ్యం కుదుట పడింది. అత్యాధునిక వైద్య పరికరాలు, పరిజ్ఞానం కలిగిన నిపుణులు ఉన్న అపోలో ఆసుపత్రి యాజమాన్యాన్ని రోగి

ఇంజినీరింగ్ అధ్యాపకులకు అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : స్థానిక విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ)పై ఇంజనీరింగ్ అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కళాశాల ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ (ఐఎసి) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ మహిళల టెక్నికల్ యూనివర్సిటీ, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామనారాయణరెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి, ఇంజనీరింగ్ అధ్యాపకులకు సిఒ-పిఒ మ్యాపింగ్‌పై అవగాహన కల్పించి, మెళకువలు నేర్పారు. ఎన్‌బిఎలో నూతన విద్యావిధానంలో మార్పులపై వివరించారు.కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, అకడమిక్ డీన్ డాక్టర్ డి.శాంతారావు, ఐఎసి కోఆర్డినేటర్ సిహెచ్‌బిఆర్ శ్రీకాంత్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రామనారాయణ

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్‌టిసి ప్రైవేటీకరణ కుట్ర

- నిర్వహణ ఆర్‌టిసికే ఇవ్వాలి
- 7న విజయవాడలో రాష్ట్ర సదస్సు
- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్‌టిసి ప్రయివేటీకరణకు కుట్ర చేస్తే అడ్డుకుంటామని, నిర్వహణ బాధ్యత ఆర్‌టిసికే ఇవ్వాలని ఎపిపిటిడి (ఎపిఎస్ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దీనిపై ఈనెల 7న విజయవాడలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. వాతావరణ కాలుష్యం పేరుతో ఆర్‌టిసిలో ప్రస్తుతమున్న బస్సుల స్థానంలో 2029 నుంచి 100 శాతం ప్రైవేట్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడానికి జిఒ 88 ద్వారా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తోందని ఆరోపించారు. పిఎంఇ బస్సు స్కీం ద్వారా రాష్ట్రంలో 11 నగరాలలో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నారన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే ఇటువంటి చర్యల వల్ల ప్రజలకు మరింత భారంతో పాటు.40 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో వాతావరణ కాలుష్యంలో ఆర్‌టిసి బస్సుల వాటా కేవలం 0.02 శాతం మాత్రమేనని, విద్యుత్తు బస్సులు ప్రవేశపెట్టిన మాత్రాన వాతావరణ కాలుష్య నివారణ నెరవేరుతుందాయని ప్రశ్నించారు. కానీ కాలుష్యం పేరుతో ఆర్‌టిసిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలకు నష్టం తప్పదన్నారు. ఇప్పుడు 0.08 శాతం అతి తక్కువ ప్రమాద రేటుతో, అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని ఆర్‌టిసి కల్పిస్తోందన్నారు. ఆర్‌టిసిలో నైపుణ్యవంతమైన డ్రైవర్లు ఉన్నారన్నారు. ఒక విద్యుత్ బస్సు ఖర్చుతో ఐదు సూపర్ లగ్జరీ డీజిల్ బస్సులను గానీ, 8 ఆర్డనరీ బస్సులను గానీ కొనుగోలు చేయవచ్చన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందించాలంటే 3 వేల బస్సులు అవసరమౌతాయన్నారు.. ఉచిత బస్సు నిర్ణయంతో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ప్రోత్సహించడం ద్వారా వాతావరణ కాలుష్య నియంత్రణతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. విద్యుత్తు బస్సు ఒక్కంటికి కేంద్ర ప్రభుత్వం రూ.30 లక్షలు సబ్సిడీ ఇస్తుందని, ఒకవేళ ఆర్‌టిసిలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టదలిచితే, కేంద్ర రాయితీతో 750 విద్యుత్ బస్సులను ప్రైవేటుకు కాకుండా నేరుగా ఆర్‌టిసి ద్వారా నిర్వహించాలన్నారు. దీనిపై చర్చించడానికి ఈనెల 7న విజయవాడలో ఆర్‌టిసి హౌస్‌లో నిర్వహించే సదస్సు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కెఆర్ కుమార్, జిల్లా అధ్యక్షులు పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

హరిప్రసాద్‌కు ఘన నివాళి

డాక్టర్ హరిప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న ఈశ్వరమ్మ, తదితరులు

ప్రజాశక్తి- మాధవధార : ప్రజావైద్యులు డాక్టర్ హరిప్రసాద్ 8వ వర్ధంతిని శుక్రవారం సాయంత్రం కంచరపాలెం బిఎన్ఆర్ ఫౌండేషన్ భవన్ లో నిర్వహించారు. డాక్టర్ వైఎల్ నర్సింగరావు, వైద్య ఆరోగ్య కార్యకర్త ఎమ్ కామేశ్వరరావు పాల్గొని డాక్టర్ హరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ ఇన్‌ఛార్జి అప్పలరాజు అధ్యక్షతన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, జనవిజ్ఞాన వేదిక కార్యకర్త ఎల్.కృష్ణారావు, మహిళా సంఘం నాయకురాలు సుమిత్ర పాల్గొని నివాళులర్పించారు.

క్రీడాకారునికి ఘన సత్కారం

నర్సింగరావును సత్కరిస్తున్న ఉక్కు పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ రాణించి, పలు పతకాలను సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారం కాంట్రాక్ట్ వర్కర్ చట్టి నర్సింగరావును శుక్రవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు సత్కరించారు. క్రీడల ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నరసింహరావు చేస్తున్న సేవలను కొనియాడారు. గతనెల 28,29 తేదీల్లో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఆరవ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్న నర్సింగరావు ఐదు కిలోమీటర్ల నడకలో బంగారు పతకం, 800 మీటర్ల పరుగులో బంగారు పతకం, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించాడు. ఈనెల 31 నుంచి వచ్చేనెల 3 వరకు కేరళ రాష్ట్రం తిరుచూర్‌లో జరగబోయే జాతీయ క్రీడలకు నర్సింగరావు అర్హత సాధించాడు. క్రీడల్లో విశేషంగా రాణించి, విశాఖ స్టీల్‌ప్లాంట్ కీర్తిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేసి నర్సింగరావు జాతీయ పోటీల్లోనూ రాణించి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతిని ధులు మంత్రి రాజశేఖర్, జె అయోధ్యరామ్, యు రామస్వామి, వైటి దాస్, కెఎస్ఎన్ రావు, దొమ్మేటి అప్పారావు, ముత్యాలు, రాంకుమార్, పోరాట కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ. : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు తొమ్మిది వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించనున్నట్లు చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరం లో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిపి ప్రభాకరరావు మాట్లాడుతూ, ప్రతిసోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌కు వినతులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి సమస్యలపై ప్రతిశుక్రవారం ప్రత్యేకంగా ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నామన్నారు.

శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో జివిఎంసి ఎనిమిదో జోన్‌కు సంబంధించి నాలుగు, మూడవ జోన్‌కు రెండు, 2,4, 6 జోన్లకు సంబంధించి చెరో అర్జీ మొత్తంగా 9 వినతులు వచ్చాయన్నారు. జివిఎంసి పరిధిలోని ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలపై ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపెన్‌ఫోరంను సద్వినియోగం చేసుకోవాలని సిసిపి ప్రభాకరరావు సూచించారు. .

ఉల్లాసంగా గీతం 'షోర్ ఫెస్ట్-25'

- భిన్న సంస్కృతులను ప్రతిబింబించిన తీరప్రాంత యువ సమ్మేళనం
- ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు, పరిశోధకులు, యువ ఇంజనీర్లు

గీతం ఫెస్ట్‌లో పాల్గొన్న ప్రతినిధులు, అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం వర్సిటీలోని బాలయోగి కళాప్రాంగణం వేదికగా తీరప్రాంత యువజనోత్సవం శుక్రవారం సందడిగా ప్రారంభమైంది. 'షోర్ ఫెస్ట్-25' పేరుతో నిర్వహించిన ఈ వేడుకను జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై.గౌతంరావు ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఐఐటి, ఎన్ఐటిల నుంచి పరిశోధకులు, యువ ఇంజనీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే వస్త్ర ధారణతో ఉత్సవంలో సందడి చేశారు. వివిధ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విదేశీ విద్యార్థులు కూడా ఉత్సాహంగా తరలి వచ్చారు.

ఈ సందర్భంగా గీతం విసి ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇటువంటి యువ సమ్మేళనం దోహదపడతాయన్నారు. యువజనోత్సవంలో పరిశ్రమలు, విద్యాలయాల మధ్య మెరుగైన సంబంధాల ద్వారా నూతన ఆవిష్కరణలు సాధ్యపడతాయన్నారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ కె.బాలాకుమార్, విద్యార్థి విభాగం డైరెక్టర్ రీమా చౌదరి, స్పోర్ట్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక, గీతం మానవ వనరుల విభాగం అధిపతి జి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలతో గీతంలో పండగ వాతావరణం సంతరించుకుంది.

అవుట్‌సోర్సింగ్ వైద్య ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంచాలి

జివిఎంసి కమిషనర్‌కు విన్నవిస్తున్న బాణాల

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న 200 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల రిటైర్మెంట్ గడువు కాలపరిమితిని మరో రెండేళ్లు పెంచాలని గ్రేటర్ విశాఖ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిలను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో జివిఎంసి పబ్లిక్ హెల్త్ విభాగం ఉద్యోగులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారన్నారు. ఇతర ఉద్యోగుల మాదిరిగానే జివిఎంసి పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ విరమణ వయస్సును 62ఏళ్లకు పెంచాలని కోరారు. ఇప్పటికే రిటైరైన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు.

ఆలోచింపజేసిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, డిఇఒ తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ అందరిని ఆకట్టుకోవడంతోపాటు ఆలోజింప చేసింది. శుక్రవారం ఉదయం జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి ప్రారంభించారు. పాఠశాల, మండల స్థాయి పోటీల్లో ఎంపికైన 33 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు.

వ్యక్తిగత విద్యార్థి కోటాలో పెందుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కె.పూర్ణచందు తయారు చేసిన మల్టీ పర్పస్ అగ్రికల్చర్ రోబోటిక్ మొదటి స్థానం లభించగా, రెండవ స్థానంలో మేథమెటికల్ మోడలింగ్ స్వచ్ఛభారత్ ప్రాజెక్టు తయారు చేసిన శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల విద్యార్థి పి.ఆకాష్‌కు దక్కింది. నడుపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.తరుణ్ కుమార్, ఎస్.యశస్విలు గ్రూపుగా తయారు చేసిన ఎంటీ స్లీప్ అలారమ్‌కు మొదటి స్థానంలో లభించగా, రెండవ స్థానంలో ఆటోమెటిక్ సేఫ్టీ మోనటరింగ్ అండ్ ప్రివెన్షన్ సిస్టమ్‌ను తయారు చేసిన మేడిద్రి గురుకుల పాఠశాల విద్యార్థులు కె.లోహిత, వై.హిమ బిందుకు దక్కింది. ఉపాధ్యాయ కేటగిరిలో ఆటోమెటిక్ ట్రైన్ కొలిసన్ సిస్టమ్ తయారు చేసిన ఎస్.కె.పురం గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు బి.సీతారామ్, కన్వర్షన్ ఆఫ్ ఫుడ్ అండ్ వాటర్ ప్రాజెక్టును తయారు చేసిన అగనంపూడి జెడిపిహెచ్‌సి స్కూలు ఉపాధ్యాయురాలు పి.కృష్ణవేణికు రెండవ స్థానం లభించింది.

దుర్గాలమ్మ కేలండర్ ఆవిష్కరణ

కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం కేలండర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ మహిమాన్వితమైన అమ్మవారని భక్తులు, ఈ ప్రాంతీయులు విశ్వసిస్తారని, దుర్గాలమ్మ ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కేలండర్ ఆవిష్కరణలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు జగుపిల్లి నాని, ఆలయ కమిటీ సభ్యులు మరుపిల్లి ఆనంద్, దుర్గాశి సోంబాబు, జగుపిల్లి అప్పారావు, గుడేల కామేశ్వరరావు పాల్గొన్నారు,

దేశాభివృద్ధిలో మన్మోహన్‌సింగ్ పాత్ర ఎనలేనిది

సంస్మరణ సభలో పలు పార్టీల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

భారతదేశం అభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పాత్ర ఎనలేనిదని పలు పార్టీల నేతలు అన్నారు. అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న అధ్యక్షతన స్థానిక న్యూ కాలనీ రోటరీ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ముందుగా మన్మోహన్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రవేశ ప్రవేశపెట్టిన సరళీకరణ ఆర్థిక విధానాలను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా, అందరిని సంప్రదించి అమలుపర్చారని తెలిపారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి చట్టాలను తెచ్చారన్నారు. లౌకికవాదిగా అన్ని మతాలను గౌరవించారని చెప్పారు. ఆయన చెప్పదలుచుకున్న అంశాలను సూటిగా చెప్పేవారని, ఆయన చేసిన సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశం ప్రపంచంలో 5వ ఆర్థిక శక్తిగా అవతరించడంతో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ ఆర్థిక శాస్త్రంలో నిష్ణాతులైన మన్మోహన్ ప్రధానిగా ఉండడం వలన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పివి నరసింహారావు దేశంలో సరళీకృత విధానాలను అవలంభించడం కోసం మన్మోహన్‌సింగ్‌ను ప్రత్యేకంగా ఆర్థిక మంత్రిగా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కె చిన్న బాబు, బోయిన భానుమూర్తి యాదవ్, తట్ట రమణ, కాళ్ళ సత్యనారాయణ, బుద్ధ కిషోర్, బొంతి రమణ, కత్తెర శ్రీధర్, పి ఎస్ దత్తు, టి.గణపతి, యేసు రాజు, ఉమ్మిడి గోవింద్, ఆర్ఆర్ నాయుడు, పి.ఆది మూర్తి, చక్రరావు, సేనాపతి రాజు, బుడబండి రాజు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, చిత్రంలో పలు పార్టీల నేతలు

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎఎంఎఎల్ విద్యార్థిని ఎంపిక

కెఎస్.శ్యామల

ప్రజాశక్తి-అనకాపల్లి : ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాలలో బిఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సిసి ఆర్మీ విభాగానికి చెందిన సీనియర్ అండర్ ఆఫీసర్ కేతిరెడ్డి సత్య శ్యామల ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెళ్ళ జయాబాబు తెలిపారు. బెటాలియన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గ్రూప్‌కి, గ్రూప్ నుండి డైరెక్టరేట్‌కు పంపుతారన్నారు. సికింద్రాబాద్లో జరిగే ప్రీ రిపబ్లిక్ డే కాంపులు మూడు జరుగుతాయని, అక్కడ డైరెక్టరేట్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడుకు ఎంపిక చేస్తారన్నారు. సత్య శ్యామల అన్ని విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఢిల్లీ స్థాయికి చేరినందుకు కళాశాల ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, కెప్టెన్ ఏఎస్ఎన్ మూర్తిలను అనకాపల్లి వర్తక సంఘ అధ్యక్షులు కొణతాల లక్ష్మీ నారాయణ, కార్యదర్శి తమ్మన రఘుబాబు, కళాశాల అధ్యక్షులు కొల్లూరు ఎస్ఎన్ మంగరాజు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ అనురాధ, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందించారు.

నిరసన తెలుపుతున్న ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికులు

చండీగఢ్ ప్రజలకు సంఘీభావంగా నిరసన

ప్రజాశక్తి-పరవాడ

చండీగఢ్‌లో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న అక్కడి ప్రజలకు సంఘీభావం తెలియజేస్తూ గురువారం ఎన్టిపిసి సింహాద్రి మెయిన్ గేట్ వద్ద ఎన్టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ చండీగఢ్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన చండీగఢ్ డిస్కం ఎలక్ట్రిసిటీ బోర్డ్ 2019-2022 సంవత్సరాల్లో 261 కోట్లు లాభం అర్జించిందని తెలిపారు. ఆ సంస్థ ఆ ప్రాంత ప్రజలకు యూనిటీ విద్యుత్తు రూ 4.50కు అందిస్తుందన్నారు. దేశంలో అత్యంత చౌకగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఈ సంస్థను మోడీ ప్రభుత్వం ప్రైవేటీపరం చేసి కార్పొరేట్ యజమానులకు ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పిపి నాయుడు, పి గోవిందరాజు, కార్మికులు పాల్గొన్నారు.

పిఎం పర్యటనకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న ఎంపీ సిఎం.రమేష్, చిత్రంలో కలెక్టర్, జెసి, అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 8వ తేదీన వస్తున్న సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనస్వాగతానికి ఏర్పాట్లు చేయాలని పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్ అన్నారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి ప్రధానమంత్రి మన ప్రాంతానికి వస్తున్నారని, బస్సులు రవాణాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందుగానే పోలీసు శాఖ రూటు ఖరారు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పర్యటన ఏర్పాట్లను వివరించారు. విశాఖపట్నం బహిరంగ సభకు జిల్లా నుండి 40వేల మంది హాజరుపర్చుతున్నట్లు, వారికి 800 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్.టి.పి.పి. అచ్చుతాపురం, నక్కపల్లిలో శంకుస్థాపన వేదికల వద్ద వర్చువల్‌గా శంకుస్థాపన చేయుటకు, ప్రధానమంత్రితో ముఖాముఖి మాట్లాడుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం కార్యక్రమం సమన్వయం చేసుకొనుటకు కలెక్టరు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, శాసనసభ్యులు బండారు సత్యనారాయమూర్తి, సుందరపు విజయకుమార్, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రోడ్డు డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎపి కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషను చైర్మన్ గండి బాబ్జి, కొప్పుల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషను చైర్మన్ పివిజి.కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్‌డిఒలు వివి.రమణ, షేక్ ఆయిషా, ఇతర అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యునిగా కాండ్రేగుల

కాండ్రేగుల వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యుత్తు నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యులుగా వినియోగదారుల హక్కుల రక్షణ సమాచార హక్కు చట్టాల ఉద్యమకర్త, రాష్ట్ర అవార్డు గ్రహీత కాండ్రేగుల వెంకటరమణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్‌గా ఠాకూర్ రామ సింగ్ వ్యవహరిస్తున్న ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇండస్ట్రీ, కామర్స్, అకడమిక్ రీసెర్చ్, కన్స్యూమర్స్, కార్మిక, ఎన్జీవో రంగాలకు చెందిన 18 మంది ప్రతినిధులు ఉంటారు. కమిటీ పదవీ కాలం మూడేళ్లు ఉంటుందని వెంకటరమణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడానికి, సిటిజన్ ఛార్టర్ అమలుకు కృషి చేస్తానని చెప్పారు.

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో పొగ మంచు దట్టంగా కురుస్తుంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుండే మంచు కురుస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతామన్న ఆందోళన నెలకొంటుంది. దీంతో లైట్‌లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో గల బంగారు మెట్ట-కసింకోట రోడ్‌లోను, వడ్డాది-రావికమతం ల మధ్య వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు.

కశింకోట : మండలంలోని శువ్రవారం భారీగా మంచు కురిసింది. దీంతో తాళ్ళపాలెం-నర్సీపట్నం రోడ్డులో వాహనం దారులు లైట్లు వేసి ప్రయాణం సాగించారు. ఉదయం 9 గంటల వరకు మంచు తీవ్రత తగ్గలేదు. రైతులు, ఉపాధి కూలీలు ఎండ వచ్చిన తరువాత పనులకు వెళ్లారు.

ఉదయం పూట లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనదారుడు

తల్లికి వందనం అమలు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నెహ్రూ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలనే ఆలోచన సరికాదన్నారు. ఇప్పటికే ఎంతోమంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, దివ్య, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

5న బాలుర జూనియర్ హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-యలమంచిలి : మదనపల్లెలో ఈ నెల 17వ తేదీన జరిగే అంతర్ జిల్లాల హాకీ పోటీలో పాల్గొనే సబ్ జూనియర్ బాలుర అనకాపల్లి జిల్లా జట్టుఎంపిక కార్యక్రమం యలమంచిలి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 5న జరుగుతుందని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి నరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సెలక్షన్స్‌కు వచ్చేవారు 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఆధార్ జెరాక్స్‌కాపీ తప్పని సరిగా తీసుకురావాలని కోరారు. సెలక్షన్స్‌కు వచ్చే వారిలో అర్హులైన వారితో అనకాపల్లి జిలా సబ్ జూనియర్ బాలుర జట్టు తుది ఎంపిక జరుగుతుందని తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన సందర్భంగా జనవరి 4వ తేదీన అక్షయ సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగరం పశువైద్య కార్యాలయంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నటు సంస్థ చైర్మన్ ఎన్‌వి. కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆస్పత్రి సహకారంతో చేస్తున్నామని పేర్కొన్నారు. దంతాలకు సంబంధించిన అన్ని వ్యాధులకు డాక్టర్ కె భాస్కర్, జనరల్ మెడిసిన్ బి లక్ష్మణ్ శ్రీనివాస్, నెఫ్రాలజీ డాక్టర్ జె ఎన్ శ్రీనివాసులు, డాక్టర్ రజినిబాబు అన్ని రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి : కుక్కల బెడదను అరికట్టడానికి యలమంచిలి మున్సిపాలిటీ పూనుకొంది. ప్రజల విజ్ఞప్తి మేరకు వందల సంఖ్యలో కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్లు శుక్రవారం ప్రారంభించింది. తొలిరోజు సుమారు 15 కుక్కలకు ఆపరేషన్ చేశారు. స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో డాక్టర్ గంగాధర్ పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్ర చికిత్స, మందులు, రిహేబిటేషన్, ఆహారం మొదలైన వాటికోసం ఒక్కో కుక్కకు రూ.1500 ఖర్చవుతుందని వెటర్నరీ ఎడి డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఈ శస్త్ర చికిత్సల ఫలితాలు రానన్న సంవత్సరంలో కనిపిస్తాయని కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు చెప్పారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి 2023-24 సీజనుకు చెరకు సరఫరా చేసిన రైతులకు టన్ను ఒక్కంటికి 200 రూపాయలు చొప్పున రైతులు ఖాతాలో జమ చేసినట్లు ఫ్యాక్టరీ ఎండి వివిఎస్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇవ్వవలసిన బాకీ టన్నుకు రూ.350 ఉందని వాటిలో ప్రస్తుతం రూ.200 జమ చేశామని తెలిపారు. 14,791 మంది రైతులకు మూడు కోట్ల 41 లక్షల రూపాయలు ఎకౌంటు ద్వారా చెల్లించమన్నారు.

కాపు సామాజిక భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ సహకారంతో కాపు సంక్షేమ భవన నిర్మాణం చేస్తామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాపు సంఘ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. దీనిపై కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

5న రోడ్డు రవాణా రంగ సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 5న జరుగు రోడు రవాణా రంగ సదస్సును జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు పిఎన్‌వి.పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అనకాపల్లి రావు గోపాలరావు కళాక్షేత్రం వద్ద గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వలన రానున్న రోజుల్లో డ్రైవర్ల వృత్తి ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో మోటార్ కార్మికులు శిక్షలు కఠిన తరం చేశారన్నారు. రోడ్లు లేకపోవడం, పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్లు వెడల్పు లేకపోవడం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలకు డ్రైవర్ని కారణం చేస్తూ తెచ్చిన చట్టం దుర్మార్గమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, రామారావు, నాని, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : ఈనెల 5న అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవన్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బైపాస్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీఓ కార్యాలయంలో జరగాల్సిన లైసెన్సు, వెహికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు అన్నిటినీ ఈ నెల నుండి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు చేసిన ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మునగపాక, వాడ్రాపల్లి ఆటో యూనియన్ నాయకులు ఇంటి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ఎన్. రాంబాబుతదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-చోడవరం : గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 10 సంవత్సరాలు చొప్పున కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ చోడవరం కోర్టులో న్యాయమూర్తి రత్నకుమార్ తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...2013లో అల్లూరి జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్కు ఎదురుగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు వ్యాలీ మండలం బొండం గ్రామానికి చెందిన పంచాడి సునీల్ కుమార్, గొల్లిరి వీరాస్వామి ఇద్దరు ఆర్టీసీ బస్సులో 20 కేజీలు గంజాయిని తరలిస్తూ పట్టుపడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం సాక్షాలు బలంగా నిరూపించడంతో చోడవరం 9వ అడిషనల్ సెషన్స్ కోర్టులో ఒక్కొక్కరికి పదేళ్ల కఠిన కారాకార శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉగ్గిన వెంకట్రావు వ్యవహరించారు.

పాడి రైతులకు సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి-సబ్బవరం : అర్హులైన పాడిరైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ చేసేందుకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది కృషి చేయాలని విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోకులం షెడ్డుల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం పెంపకం, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్ గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం గత ఏడాది అక్టోబర్ 25 నుండి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతున్న అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని సబ్బవరం పంచాయితీలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో స్థానిక పశు సంవర్ధక శాఖ ఏడి కె.ఉషాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన త్వరితగతిన చేపట్టాలి

కె.కోటపాడు : గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని త్వరితగతన చేపట్టాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పశు వైద్య సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కే సొంతపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గోకులం షెడ్లను పూర్తి చేయాలని, పశుగ్రాస పెంపకాన్ని రైతులు వినియోగించేలా అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ పశు వైద్యులు డాక్టర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని 4 మండలాల సిబ్బంది రబీ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయాలని వ్యవసాయశాఖ ఏడి మోహనరావు అన్నారు. శుక్రవారం ఏడి కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రోక్యూర్‌మెంట్, రబీ పంట నమోదు, రబీ సీడ్ డిస్ట్రిబ్యూషన్, పాడి పంటలు మార్జిన్లను కూడా రైతులకు చేరువ చెయ్యాలన్నారు. పిఎం కిసాన్ మీద రివ్యూ చేయడం జరిగింది. రైతు సేవా సిబ్బంది ఎల్ల వేళలా రైతుకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అదనపు డైరెక్టర్ సమంత, 4 మండలాల వ్యవసాయాధికారులు మోహనరావు, శంకర్‌గోవింద్, సౌజన్య, ఏఇఓ దేముడు నూకరాజు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమానికి వంట పాత్రల వితరణ

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో ఆరవ రోజు శుక్రవారం కశింకోటలోని సత్యసాయి ఆశ్రమానికి వంట సామాగ్రి, కుర్చీలు నిమిత్తం రూ.10వేలు నగదును రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, కాంగ్రెస్ నాయకులు సతీష్ , తాకాసి కృష్ణ, కర్రి సత్యనారాయణ, బుద్ధిరెడ్డి గంగయ్య, కర్రి దుర్గునాయుడు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, జెర్రిపోతుల నూకునాయుడు, కర్రి గోవింద, బలిజ ముసిలి నాయుడు, ద్వారపూడి సత్తిబాబు, ఎస్ఎం నాయుడు, శెట్టిపల్లి అప్పలనాయుడు, రెడ్డి సూర్యనారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు

వంట పాత్రలు అందిస్తున్న గొంతిన శ్రీనివాసరావు తదితరులు

చిన భీమవరంలో సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట

మండలంలోని ఆర్.భీమవరం శివారు చిన భీమవరంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'వెంకట్రామయ్యగారి తాలూకా కేరాఫ్ సీతారాంపురం' అనే సినిమా షూటింగ్ పది రోజులుగా చిన మళ్లాం, గోకివానిపాలెం, ఆర్ భీమవరం గ్రామాలలో జోరుగా కొనసాగుతుంది. శుక్రవారం చిన భీమవరంలో పడమటమ్మ గుడి వద్ద పాట చిత్రీకరణ చేశారు. కోమలి ప్రొడక్షన్లో సతీష్ ఆవాల దర్శకత్వంలో ఈ సినిమా చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ మానవీయ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు అనే అంశంతో ఈ సినిమాను నిర్మిస్తున్నట్లు చెప్పారు. విలేజ్, టౌన్ బ్యాక్ డ్రాప్‌తో సినిమా కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాలకు నచ్చే విధంగా ఫ్యామిలీ ఓరియంటేషన్లో సినిమాను తీస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11 వరకు బుచ్చెయ్యపేట మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో సినిమా షూటింగ్ ఉంటుందని, తన మిత్రుడు గొల్లగాని శ్రీనివాస్ యాదవ్ సూచన మేరకు తాము ఈ ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నామని తెలిపారు. తదుపరి విశాఖ నగరంలో షూటింగ్ చేస్తామన్నారు. మార్చి 30న సినిమా విడుదల చేస్తామని తెలిపారు. సినిమాలో యాక్షన్, కామెడీ, సంగీతం, మానవ సంబంధాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని, పాటలు అందరినీ ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. స్థానిక వ్యక్తి చోడపల్లి శ్రీనివాసరావుకు సినిమాలో నటించే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్లు దినేష్, దివిజ, ప్రభాకర్, బలగం ఫెమ్ నారాయణ, సీనియర్ నటి సుధ, జబర్దస్త్ సత్య, సినీ నిర్మాత, పాటల రచయిత, ప్రముఖ ఫోక్ సింగర్ సింగర్ కోమలి పాల్గొన్నారు. పడమటమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెలంకాయల అప్పలనాయుడు చిత్ర బృందానికి అవసరమైన సహాయ సహకారాలు అందించారు.

ప్రజాశక్తి సబ్ ఎడిటర్ నుండి సినిమా డైరెక్టర్‌గా...

సినిమా డైరెక్టర్ సతీష్ ఆవాల గతంలో ప్రజాశక్తి దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. హైదరాబాదులో ప్రజాశక్తి జర్నలిజం కాలేజీలో శిక్షణ పొందిన సతీష్ అదే సంస్థలో నాలుగేళ్ల పాటు సబ్ ఎడిటర్‌గా పని చేశారు. అనంతరం పలు పత్రికల్లో కూడా పనిచేసినట్లు సతీష్ తెలిపారు. సినిమా రంగంపై ఆసక్తితో పలు సినిమాలకు కో డైరెక్టర్‌గా పని చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వెంకట్రామయ్య గారి తాలూకా కేరాఫ్ గోపాలపురం సినిమా డైరెక్టర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు.

నేడు లూయీ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి-పరవాడ : అంధుల పాలిట పెన్నిధి, ప్రపంచ ప్రఖ్యాత గాంచిన బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయీ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు మండల కేంద్రం పరవాడ మరిడిమాంబ కళ్యాణ మండపం వద్ద శనివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు అంధుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్.అర్జున రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, స్థానిక ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్, జెడ్పిటిసి పైల సన్యాసిరాజు, స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు హాజరవుతున్నారని, అందరూ వచ్చి జయప్రదం చేయాలని కోరారు .

విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణకు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఏడాది వార్షిక అవసరాలు, రిటైల్ ధరలు వాటిపై జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడటానికి పేర్లుత నమోదు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చోడవరం ఏడి యు.కుమార్ గౌరీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ, 10న కర్నూలులో నేరుగా ప్రజాభిప్రాయ సేకరణతో పాటు, వినియోగదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలను తెలపవచ్చని తెలిపారు. ఇందుకోసం విశాఖపట్నం ఈపీడీసీఎల్ కార్యాలయం, సర్కిల్, డివిజన్ కార్యాలయంలోనూ మాట్లాడేవారు ఏ విషయంపై మాట్లాడుతారని తెలియపరచి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి- రాంబిల్లి

జిల్లాలోని ఎస్.రాయవరం మండలం, లింగరాజుపాలెం గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్లూరి విగ్రహం ఎడమ చెయ్యి బాణాన్ని విరగ్గొట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశ స్వతంత్ర్యం కోసం, గిరిజనుల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. పోలీసులు దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.రాంబాబు, వై.రాము, వై.రాజేశ్వరి, సిహెచ్ లక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-సబ్బవరం

భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అసకపల్లిలో 12, ఎరుకునాయుడుపాలెంలో 12 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరావు, మాజీ సర్పంచ్ కరణం రామునాయుడు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, స్థానిక నేతలు రాపర్తి సన్నిబాబు, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, రాపర్తి బాబురావు, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో ఈశ్వరరావు, విలేజ్ సర్వేర్ మోహన్ పాల్గొన్నారు

బుచ్చెయ్యపేట : మండలంలోని మల్లం, ఆర్ భీమవరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మండల తహశీల్దారు ఎం.లక్ష్మీ రైతుల నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తహసిల్దార్ నరసింహామూర్తి అన్నారు. మండలంలోని శుక్రవారం సిహెచ్ బి అగ్రహారం, బోదుగల్లం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పాసు పుస్తకాలు, వెబ్ ల్యాండ్ సమస్యలపై పలువురు అధికారులకు అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో బోదుగల్లం సర్పంచ్ మున్నిషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్ల : సుంకపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో తహసిల్దార్ తిరుమల బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 5 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఊర్ధవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ మండల అధ్యక్షులు రమేష్, వీఆర్వో పెద్దన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో దేవాదాయ భూమి జిరాయితీ భూమి కింద, జిరాయితీ దేవాదాయ కింద మార్పు జరగడంతో వీరవిల్లి అగ్రహారం గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వీరవిల్లిఅగ్రహారం గ్రామంలో సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గతంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయానికి దొండా వరహాలు దొర కుటుంబ సభ్యులు తమ భూమి దేవాలయానికి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిన భూమిని అధికారులు ఆన్లైన్ చేయకపోవడంతో అది జిరాయితీ భూమి కింద చూపించి కొంతమంది బడా బాబులు ఆక్రమించుకొని అమ్ముకాలు జరుపుతున్నారని తెలిపారు.దీనిపై ఎన్నిమార్లు రెవిన్యూ, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలను అందించినప్పటికీ అధికారులు స్పందించిన దాఖలాలు లేవన్నారు. అధికారులు స్పందించకపోతే అమరావతిలో జరిగే ప్రజా దర్బార్ కు వెళ్లి వినతి పత్రం అందజేస్తామని గ్రామస్తులు తెలిపారు. రీ సర్వేయర్ డిటీ గణపతిరావుకి వినతిపత్రం అందజేశారు.

గొలుగొండ : గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూముల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని గొలుగొండ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కిల్లాడి వెంకటరమణ, బొడ్డు సత్యనారాయణ, శ్రీనివాసరావు, వంటాకుల అప్పలనాయుడు, కోనేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

విశాఖలో నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశంలో మహిళా అభ్యున్నతి, స్త్రీ విద్య కోసం పరితపించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని యువ న్యాయవాది చిట్టా జయశ్రీ అన్నారు. సావిత్రిబాయి పూలే 134వ జయంతి కార్యక్రమం శుక్రవారం అనకాపల్లి గాంధీనగర్‌లో జరిగింది. కార్యక్రమంలో ఎలుగుబంటి సుధ, ఐఆర్.గంగాధర్, అవినాష్ ఇళ్ల, ఓడిబోయిన రాంబాబు, పోలవరపు ఆనంద్ పాల్గొన్నారు. అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్లో జరిగిన కార్యక్రమంలో ఆలిండియా ఓబిసి అసోసియేషన్ రాష్ట్ర ఇంచార్జ్ ఆడారి కుమారస్వామి, డిప్యూటీ తహశీల్దారు శ్రీరామూర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జెడ్‌పి హైస్కూల్ పాఠశాలలో జరిగిన యాజమాన్య కమిటీ సభ్యుల శిక్షణా కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎంఇఒలు పడాల్ దాసు, ఉషారాణి, హెచ్ఎం సుందరి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఎంఇఒ ఉషారాణిని, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. దొగ్గ శ్రీనివాస్, బత్తి శ్రీనివాస్ కుమార్, పి సురేష్, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు

కశింకోట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ జి గ్రేస్ సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఇందు, జే.మెర్సీ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని తురకలపూడి జెడ్‌పి హైస్కూల్‌లో ఇంచార్జి హెచ్ఎం సిహెచ్.రాజేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు బి.కరుణను సన్మానించారు. ఉపాధ్యాయులు టివి.రమణ, శ్రీను, రాంప్రసాద్, నూకేష్, బ్రమ్మాజీ పాల్గొన్నారు. దిబ్బడి జెడ్‌పి హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డివిజె అప్పారావు, వెంకట్, పద్మావతి, ప్రమీల, అనసూయ, భాను పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఐవివి సత్యవతి, అధ్యాపకులు లక్ష్మీ మంగమ్మ, జ్యోతి, డి.మాల్యాద్రి, వి అప్పలనాయుడు విద్యార్థులు పాల్గొన్నారు. చోడవరం జడ్పీ గర్ల్స్ హై స్కూల్‌లో సావిత్రిబాయి పూలేకు హెచ్ఎం రామిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మిడ్డేమీల్స్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల జి.వరలక్ష్మి, మండల నాయకులు బుచ్చి రాజమ్మ, శానిటేషన్ కార్మికుల యూనియన్ నాయకురాలు దేవి, ఉమా, అమ్మాజీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో...

అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళులర్పించారు. హెచ్ఎం దువ్వూరి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నేతలు పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ఎస్.లలిత కుమారి, పి.లలిత కుమారి, జేఎన్‌బిఎంకెఎ.మంగమ్మ, ఏ.సూర్యకుమారి, ఎం.విక్టోరియా రాణి, లెక్కల నాగలక్ష్మి, వై.శోభ, ఎం.పద్మజ తదితరులను సత్కరించారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన..

రాంబిల్లి : మండలంలోని పంచదారల పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.మాణిక్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: మండలంలో చెట్టుపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంగన్వాడి కార్యకర్త ధనలక్ష్మిని సత్కరించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి , మోపాడ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయురాలు పద్మ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ గౌతం పూలమాలవేసి నివాళులు అర్పించారు. సావిత్రిబాయి పూలే దేశంలోనే మొట్టమొదటి మహిళా టీచర్ అని, గ్రామాల్లో పేదలకు విద్యాభ్యాసం చేసేవారన్నారు.

చీడికాడ:మండలంలోని జైతవరం గ్రామ సచివాలయంలో సావిత్రిబాయి పూలేకు కార్యదర్శి కొల్లి నవీన్ కుమార్, సర్పంచ్ కోడూరు సత్యవతి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది సుధారాణి, కళ్యాణి, చిన్నమ్మలు, ప్రభావతి, గౌరీ, రమణ బాబు, ఎం. శ్రీనివాసరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు కేఎల్‌వి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుజాత, రామలక్ష్మి, పిడి అచ్యుతరావు, వరప్రసాద్, దేవుడు, రామారావు, దేవి, ఉమాదేవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం అంగన్వాడీ కేంద్రంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.రాధాకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సావిత్రిబాయి పూలే గొప్ప సంస్కర్త, ఉద్యమ శీలి అని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సంఘం నాయకులు ఎం.జగ్గునాయుడు, పి.మణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలేలు దేశ సాంఘిక సంస్కరణ ఉద్యమంలో అద్భుతమైన పాత్ర నిర్వహించారన్నారు. మహిళలందరికీ చదువుకునే హక్కు ఉండాలని పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.సీతాలక్ష్మి, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు, రమణ, ప్రదీప్, కుమారి, సురేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పల్లవి, సాయితేజ, గుణ, శశి పాల్గొన్నారు.

గాజువాక : నడుపూరు జెడ్‌పి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక పెదగంట్యాడ కమిటీ ఆధ్వర్యంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశురాం పాల్గొని, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెవివి మండల కార్యదర్శి ఎమ్ .సింహాచలం అధ్యక్షతన

చోడవరంలో...

నర్సీపట్నంలో నివాళ్లర్పిస్తున్న నాయకులు

జరిగిన కార్యక్రమంలోఉపాధ్యాయులు నారాయణరావు, ఈశ్వర రావు, మహిళా ఉపాధ్యాయుల కార్యదర్శి కె. మంగమ్మ, జెవివి నాయకులు ఢిల్లీరావు, వై.వరప్రసాద్, కెటియు భాస్కర్, డి. వెంకటరావు పాల్గొన్నారు. జెవివి తరపున 42మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

పాత వడ్లపూడి దళిత కాలనీలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బన్న నివాళులర్పించారు, కెవిపిఎస్ వడ్లపూడి, గాజువాక డివిజన్ అధ్యక్షులు గాలి రమణమ్మ, సరోజిని, ఉపాధ్యక్షులు ఇమ్మాన్యుయేల్, స్థానిక నేతలు రమాదేవి, సాధూరావు , శ్రీరాములు పాల్గొన్నారు.

ములగాడ: మల్కాపురం సిఐటియు కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జోన్ అధ్యక్షులు కె.పెంటారావు పూలమాలవేసి నివాళులు అర్పించారు జోన్ నాయకులు ఎ.సత్యారావు, ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి, పి.పైడిరాజు, కె.రాము, ఏసుబాబు, బుజ్జి గంట దాసు, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాది ఐద్వా కార్యాలయంలో సావిత్రిబాయి పూలేకు మధురవాడ జోన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.సుజాత,బి భారతి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.పుష్ప, ఎల్ పద్మ, బి లక్ష్మి, డి. తులసి, డికె.చంద్రిక డి.ఉమాశైలజ పాల్గొన్నారు.

పిఎం పాలెం బాబా ఇంజనీరింగ్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కళాశాల సెక్రటరీ కొండ్రు శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ పూర్ణ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ కె.అనిల్ కుమార్, బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్. జయరంగరావు, వివిధ విభాగాధిపతులు, మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : సావిత్రీబాయి పూలే జయంతి, జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డైట్‌లో ఐదుగురు మహిళా అధ్యాపకులు మాధవి, మహా లక్ష్మి, హరిణి, నీలిమలను ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి, అధ్యాపకులు సుధాకర్, నాగేశ్వర రావు, సోమయాజులు, త్రినాథరావు సత్కరించారు.ముందుగా పూలేకు నివాళులర్పించారు.

స్థానిక జివిఎంసి హైస్కూల్‌లో సావిత్రీబాయి పూలేకు హెచ్ఎం, ఇ వెంకటరావు అధ్యక్షతన నివాళులర్పించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూక రాజు, అల్లాడ శ్రీనివాసరావు, మరగడ రామకృష్ణ, ఎ రామకృష్ణ పాల్గొన్నారు.ఒకటో వార్డు కొండపేట, మండలంలోని కృష్ణంరాజు పేట, తాటితూరు పాఠశాలల్లో పూలే జయంతిలో హెచ్ఎంలు అమర్‌నాథ్, గొట్టిపల్లి సత్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని బిజెపి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి నివాళులర్పించారు. కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సిరపరపు వెంకట్రావు, పాలూరి కృష్ణారావు పాల్గొన్నారు.

సీతమ్మధార : జైభీమ్ కల్చరల్ వెల్ఫేర్ ఆసోషియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంధాలయంలో సావిత్రిభాయిఫూలే జయంతి జరిగింది. పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ కె.లలితక్క, పతివాడ రాంబాబు, డాక్టర్.రమేష్ బాబు, కంట్రెడ్డి రామన్న పాత్రుడు, ఎస్.ఆర్.వేమన, కోన. ప్రకాష్. ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనెట్ సమావేశమందిరంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విసి ఆచార్య శశిభూషణరావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంటర్ ఫర్ వుమన్ స్టడీ డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న ఆర్‌డిఒ రమణ

బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనకు..

రాజయ్యపేటలో స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ వర్చువల్‌లో ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో మండలంలోని రాజయ్యపేటలో పరిశ్రమలు ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని శుక్రవారం నర్సీపట్నం ఆర్‌డిఓ వివి రమణ పరిశీలించారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో మౌలిక వసతులు కల్పనకు గాను గత ఐదు రోజుల నుండి పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ నరసింహమూర్తి, ఏపిఐసి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. రాజయ్యపేటలో సర్వేనెంబర్ 279లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో విశాఖ నుండి ప్రధాని నరేంద్ర మోడీ స్థానిక రైతులు, నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పాల్గొన్నారు.

డిపిఆర్ సూపర్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నూతనంగా దివాకర్, ప్రసన్న ఏర్పాటు చేసిన డిపిఆర్ సూపర్ మార్కెట్ ను శుక్రవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నర్సీపట్నంలో సరికొత్తగా సూపర్ మార్కెట్ ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల జనసేన అధ్యక్షులు గండెం దొరబాబు, యువ నాయకులు ప్రగాడ కృష్ణ, మాకిరెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రూ. 9 లక్షల నిధులు మంజూరు

ప్రజాశక్తి-కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో సీసీ కాలువలతో పాటు తాగునీటి బోర్లు ఏర్పాటుకు రావికమతం ఎంపిపి పైల రాజు రూ.9 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్లు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కొత్తకోట ఎంపీటీసీ పూడి మరిడియ్య (దేవ) తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ఒకటో ఎంపీటీసీ పరిధిలో జెట్టి బాబురావు ఇంటి నుంచి కలగర్ల రాధాకృష్ణ దుకాణం వరకు సీసీ కాలువ నిర్మాణానికి సుమారు రూ.2 లక్షలు మంజూరు కాగా సుబ్రహ్మణ్యంస్వామి గుడి ప్రాంగణంలో లక్ష నిధులతో తాగునీటీ బోర్, రెండవ ఎంపిటిసి పరిధిలో అంబేద్కర్ కాలనీ -1 లో పసుపులేటి అప్పారావు ఇంటి నుంచి వేమవరపు ప్రసాద్ ఇంటి వరకూ సిసి కాలవలో కాంక్రిట్ వేసేందుకు రూ లక్ష నిధులు ఖర్చు చేస్తుండగా కమ్యూనిటీ హల్ నుంచి చిట్ల రాబర్ట్ ఇంటి వరకూ సిసి కాలవ నిర్మాణానికి మరో రూ 2లక్షలు నిధులు, మూడవ ఎంపిటిసి పరిధి లో అంబేద్కర్ కాలనీ 2 లో పూతి అప్పారావు ఇంటి నుంచి బుంగా శ్రీనివాసరావు ఇంటి వరకూ సిసి కాలవ నిర్మాణానికి మరో రూ 3 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

పథకాలు సకాలంలో అందజేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందజేయాలని ఆ సంఘం అధ్యక్షులు కొల్నాటి తాతాజీ, కార్యదర్శి అల్లాడ కొండబాబు కోరారు. నక్కపల్లిలో నూకాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం కార్మిక శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయించుకోవాలని, కార్డు లేని వారు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కార్మికులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

గుర్తింపు కార్డులు ఇస్తున్న నాయకులు

రోడ్డు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

ప్రజాశక్తి-కొత్తకోట: గిరిజన గ్రామాలకు సంబంధించి ప్రత్యేక డిఎల్‌సి సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణాలకు ఫారెస్ట్ అధికారులు అనుమతులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, మర్రి శ్రీను, కొర్రా బాలరాజు, కిల్లో సూరిబాబు తదితరులు కోరారు. సిపిఎం నేతలు గిరిజనులతో శుక్రవారం డోలి ప్రదర్శన చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, రహదారి లేని గిరిజన గ్రామాలను జిల్లా కలెక్టర్ తక్షణమే పరిశీలించాలన్నారు. రహదారి తో పాటు మౌళిక సదుపాయాలు లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామం

సిపిఎం ఆధ్వర్యాన డోలీ ప్రదర్శన

నేరేడుబంధలో పివిటిజీ కొందు తెగకు చెందిన 70 జనాభా ఉన్నారని, ఈ గ్రామానికి ఎన్ ఆర్ ఈ జి ఎస్ మెటీరియల్ కాంపినేటివ్ రూ 50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేయాల్సివుందని, దీనికి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి తక్షణమే ఫారెస్టు అనుమతి ఇవ్వాలన్నారు. సికాయిపాడు నుండి చలిసింగం గ్రామానికి జి.ఓ 726/పి ఆర్ ప్రాజెక్ట్‌లో రూ 2 కోట్ల 66 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి ఏడాది కిందట నిధులు మంజూరైనా జాయింట్ సర్వే చేసి ఫారెస్ట్ అనుమతులు ఇవ్వకుండా కాల యాపన చేసారని ఆరోపించారు. ప్రత్యేక డి ఎల్ సి సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు పనులు

నిరసన చేపడుతున్న నాయకులు, గిరిజనులు

ప్రారంభం కాలేదని, తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడిగులోవ, పశువులు బంధ, సోంపురం గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

గ్రామ సభలో సమస్యల వెల్లువ

కొత్తకోటలో మాట్లాడుతున్న ఇఒ

ప్రజాశక్తి-కొత్తకోట: సమస్యలు పరిష్కారం కానీ గ్రామసభలు ఎందుకని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రావికమతం మండలం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పూడి అర్జునరావు, వెల్లంకి శ్రీను, బుంగా రాజారావు తదితరులు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా తీరలేదని జల జీవన్ నిధులతో ఏర్పాటుచేసిన పైపులైను అస్తవ్యస్తంగా ఉందని, డ్రైన్ వ్యవస్థ సక్రంగా లేకపోవడంతో దోమలు వృద్ధి చెందడంతో గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని నివారణకు కు చర్యలు చేపట్టాలని, రాజు వీధి మార్గంతో పాటు బజారు వీధిలో ఆక్రమణ నిర్మాణాలు కొనసాగుతు న్నాయన్నారు. గ్రామంలో ఒకటోవ వార్డులో డ్రైన్ వ్యవస్థ పూర్తిగా శిధిలం కావడంతో ఇల్లు మధ్యలో మురుగునీరు నిల్వ చేరుతుందని వార్డు సభ్యులు సభ దృష్టికి తెచ్చా రు. దీనిపై స్పందించిన ఈవో జ్యోతి రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యలపై ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేశామని మూడు సచివాలయాల విభాగాల్లో తాగునీటికి సరఫరాకు చెందిన ఇంజనీరు సిబ్బంది లేక పోవడంతో తాగునీటి సమస్య జటల్మవుతుందని దీనిపై నివేదిక జిల్లా అధికారులకు పంపామన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, వైసీపీ మండల శాఖ బి సి సెల్ అధ్యక్షులు బేతా పాండు, టిడిపి గ్రామ నాయకులు ఉగ్గిన శ్రీను, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండలో మాట్లాడుతున్న కార్యదర్శి

గొలుగొండ మండలంలోని లింగంపేట, ఎం.కంఠారం, గొలుగొండలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో గ్రామాభివృద్ధిపై చర్చించారు. డ్రైనేజీలు, రోడ్లు, పారిశుద్యం వాటిపై చర్చించారు. లింగంపేటలో సర్పంచ్ తోకల సంతోష్ కుమార్, టీడీపీ నాయకుడు మరిశా రమణ, కార్యదర్శి పి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కంఠారంలో సర్పంచ్ బి.రాజేశ్వరి, గొలుగొండలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

స్పీకర్ అయ్యన్న పాత్రుడు

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: వెలుగు సిబ్బంది, బ్యాంకర్స్‌తో స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వాక్రా గ్రూపు సభ్యులు తీసుకుంటున్న రుణాలు వారికి ఎంతవరకు ఉపయోగకరంగా ఉంటున్నాయో వారిని అడిగారు. నియోజవర్గంలోని మండలాల్లో ఉన్న గ్రూపులు, రుణాలు చెల్లింపులపై బ్యాంకర్స్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్న తరహా పరిశ్రమలు పెట్టడానికి ప్రోత్సహించాలని అన్నారు. సభ్యులకు సబ్బులు, షాంపూలు, క్యాండిల్స్, పసుపు పొడి వంటి వివిధ ఉత్పత్తుల తయారీపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశ్రమలలో తయారు చేసిన వస్తువులను బ్రాండింగ్ చేసి, ఆన్లైన్, సూపర్ మార్కెట్లలో అమ్మే విధంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వెలుగు డిపార్ట్మెంట్, బ్యాంకర్లు సమన్వయంతో డ్వాక్రా గ్రూప్ సంఘాలను ఆర్థికంగా అభివద్ధి చెందేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్, ఏపి ఎమ్‌లు, నాలుగు మండలాల ఎస్‌బిఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల అభివృద్ధికి పని చేయాలి'

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో పాఠశాలల యాజమాన్య కమిటీలు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీపీ పైలరాజు అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్ లకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లు సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. క్రమశిక్షణ, గుణాత్మకమైన విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు ప్రాథమిక

'మాట్లాడుతున్న ఎంపిపి

స్థాయి నుంచే మంచి అలవాట్లను అలవారిచే విధంగా చూడాలన్నారు. ఎంపీడీవో వెంకన్న బాబు మాట్లాడుతూ, పాఠశాల విద్యా విధానాలు, లక్ష్యాలు, వార్షిక బడ్జెట్ ప్రణాళికలపై ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, రిసోర్స్ పర్సన్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపి నుంచి ఆదిలక్ష్మి తొలగింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపల్ మాజీ చైర్ పర్సన్, 17వ వార్డు కౌన్సిలర్ జి.ఆదిలక్ష్మిని వైసీపీ పార్టీ సస్పెండ్ చేసినట్లు టౌన్ వైసీపీ అధ్యక్షులు యాకా శివ తెలిపారు. శుక్రవారం నర్సీ పట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో పదవులు అనుభవించిన ఆదిలక్ష్మి అధికారం కోల్పోయిన వెంటనే తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కారణంగా, ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి టిడిపికి అనుకూలంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రమాణ స్వీకారానికి వైసీపీ కౌన్సిలర్లు వెళ్లక పోయినా గుడబండి ఆదిలక్ష్మి, గొలుసు నరసింహమూర్తి ఈ కార్యక్రమానికి హాజరై మద్దతు పలికారన్నారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ముస్లిం బడి లోని క్లస్టర్ అఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ లో భాగంగా కబడ్డీ పోటీలను నెహ్రూ యువ కేంద్రం(విశాఖపట్నం) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో బాలికల ప్రథమ బహుమతి ముస్లిం బడి, ద్వితీయ బహుమతి పెదబొడ్డేపల్లి క్రీడాకారులు గెలుపొందారు. గెలుపొందిన విజేతలకు ప్రముఖ వ్యాపార వేత్త వెలగా నారాయణరావు, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ హనుతేజ్ మెడల్స్, ట్రోఫీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వి రమణ, క్రీడల ఉపాధ్యాయురాలు లక్ష్మి, ప్రియాంక, రమణ పాల్గొనారు.

5న ఆదివారం 15 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు బాక్సింగ్, ఉషు, రన్నింగ్, వాలీబాల్ , షాట్ పుట్ పోటీలను ఎన్టీఆర్ స్టేడియం నర్సీపట్నం లో ఉదయం 6 గంటల నుండి ఎన్ వై కే నిర్వహిస్తామని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దొన్నుదొరకు వినతి

ప్రజాశక్తి- మాడుగుల: విశాఖపట్నం, పాడేరు మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులను మాడుగుల మీదుగా రాకపోకలు సాగించేలా చూడాలని మాడుగుల గ్రామానికి చెందిన నాయకులు కొట్యాడ రమేష్, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం అరకులో విజయనగరం జోనల్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ సివేరి దొన్ను దొరకు వినతి పత్రం అందించారు. నిత్యం దూర ప్రాంతాల నుండి ప్రయాణం కొనసాగిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు సకాలంలో బస్సుల రాకపోకలు సాగించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. తెలిపారు.

కురుస్తున్న పొగ మంచు

మైదానంలో దట్టంగా మంచు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో మంచు దుప్పటి కప్పుకుంది. శుక్రవారం ఉదయం నుంచి తొమ్మిది గంటల వరకు దట్టంగా మంచు కురియడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు, వృద్ధులు, పాఠశాలకు వెళ్లే చిన్నారులు, ఉపాధ్యాయులు ఉద్యోగులు, ఇబ్బందులు పడుతున్నారు. మంచు దట్టంగా కురియడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థలు పడుతున్నారు. కురుస్తున్న మంచుకు చలిగాలులకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఉపమాకలో ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఇత్తడి గజ వాహనంపై వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలోను వేయింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు.